www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 15 సెప్టెంబర్ 2025

కేసుల పరిష్కారంలో జిల్లాకు రాష్ట్రస్థాయి ర్యాంకు

ప్రజాశక్తి - కడప : జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించినందుకు గాను రాష్ట్ర స్థాయిలో కడప జిల్లాకు ర్యాంక్ వచ్చిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని, డిఎల్ఎస్ఎ ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 21894 క్రిమినల్ కేసులు, 214 సివిల్ కేసులు, 63 ఫ్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించి రూ.16 కోట్ల 24 లక్షల 85 వేల 555 మొత్తాన్ని కక్షిదారులకు చెల్లించినట్లు తెలిపారు. కడపలో 2566 కేసులు, ప్రొద్దుటూరులో 894, రాజంపేటలో 1589, రాయచోటిలో1187, బద్వేల్‌లో 1397, మైదుకూరులో 1801, జమ్మలమడుగులో 4493, సిద్ధవటంలో 524 కేసులు పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. రైల్వేకోడూరులో 300, పులివెందులలో 2015, నందలూరులో 967, లక్కిరెడ్డిపల్లిలో 2092, కమలాపురంలో 2346 కేసులు జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించినట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అరటి ధరలు నేల చూపు!

- నెల లోపే 60 శాతం తగ్గుదల
- రైతులకు మరోసారి క(న)ష్టం
- గిట్టుబాటు ధర కోసం ఎదురు చూపులు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

అరటి ధరలు రోజురోజుకు తగ్గుతున్నాయి. నెల లోపే 60 శాతం మేరా తగ్గాయి. రైతులకు మరో మారు నష్టం, కష్టం తప్పడం లేదు, గిట్టుబాటు ధర కోసం రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో అత్యధికంగా అరటి పండించే నియోజకవర్గం పులివెందుల అని చెప్పవచ్చు. ఇటీవల చీని రైతులు కూడా అరటి పంట సాగు వైపు మొగ్గు చూపడంతో పంట విస్తీర్ణం మరింత పెరిగింది. లింగాల మండలంలో అరటితో పాటు చీని పంట కూడా సమానంగా ఉండేది. ప్రస్తుతం ఎక్కడ చూసినా అరటి పంటలు కనిపిస్తున్నాయి. ఇదీలా ఉంటే నిలకడ లేని ధరల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉద్యానవన రైతుకు ఊతమిస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున ప్రకటనలు చేశారు. అదే సమయంలో విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా మంచి ధరలు వస్తున్నాయని రైతులు ఎంతో ఆశతో ఉన్నారు. కానీ సరిగ్గా నెల తిరిగిలోపు అరటి ధరలు నేల చూపులు చూస్తున్నాయి. 25 రోజుల్లోనే అరటి ధర సగానికి పైగా పడిపోయింది. కొనుగోలు దారులు కోసం రైతులు ఎదురు చూపులు చూసే పరిస్థితి నెలకొంది. కొంతమంది రైతులు 'ముందు పంటను తీసుకువెళ్లండి డబ్బులు తరువాత ఇవ్వండి' అంటూ వ్యాపారాలను బతిమాలుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. పులివెందుల నియోజకవర్గంలో సుమారు 20 వేల ఎకరాలలో అరటి పంట సాగులో ఉంది. ఏడాదికి సుమారు లక్షల టన్నుల దిగుబడి అరటి వస్తుంది.

నెలరోజుల లోపే సగం పైన ధర పతనం

అరటి పంట చేతికొస్తున్న సమయంలో ధరలు అమాంతంగా పడిపోతున్నాయి. నెలరోజుల ముందు వరకు అరటి టన్ను రూ. 22 వేల వరకు పలికిందని ఇప్పుడు రూ.8 వేల కూడా అడిగేవాడు లేడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాయలను కొనడానికి ముందుకు రావడం లేదని వాపోయారు. కొనేవారు లేకపోవడంతో ఏ రకంగా అమ్ముకోవాలో పాలుపోని పరిస్థితుల్లో ఉన్నారు. వ్యాపారులేమో బయట డిమాండ్ లేదంటూ ధరను ఆమాంతంగా తగ్గించారు. ఎకరానికి రూ. 1.50 లక్షల పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేస్తే ఇప్పుడు ధర తగ్గి నష్టపోయే పరిస్థితులు నెలకొనడంతో ఆందోళన చెందుతున్నారు.

ధర రోజురోజుకూ తగ్గిపోతోంది

లక్షలు ఖర్చు పెట్టి మూడు ఎకరాల్లో అరటి పంటను వేశాం. ఈ ఏడాది ప్రకృతి అనుకూలించడంతో దిగుబడులు బాగా వచ్చాయి. ధర. కూడా 25 రోజుల ముందు బాగుండటంతో ఈసారి సమస్యల నుంచి గట్టెక్కుతామని ఆశించాం. తీరా కోత దశకు వచ్చేసరికి ధర అమాంతంగా తగ్గిపోయింది. రూ.8 వేలకు టన్ను కూడా అడిగేవారు లేదు.

-రామ్మోహన్ రెడ్డి, అరటి రైతు, లింగాల మండలం

ఉచిత బీమా సౌకర్యం కల్పించాలి

ప్రభుత్వాలు అరటి రైతులకు ఉచిత బీమా పథకాన్ని కల్పిస్తే రైతుకు కొంత ఊరట కలుగుతుంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే బీమా వస్తుంది. దీంతో రైతుకు నష్టం ఉండదు. ఈ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలోచించి రైతులకు న్యాయం చేయాలి

– మదన్ మోహన్‌రెడ్డి, రైతు , లింగాల మండలం

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

చెర్లోపల్లి సమస్యలపై 15 నుంచి దశల వారీ పోరాటం

- సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరం శివారు ప్రాంతంలో ఉన్న చెర్లోపల్లి రహదారి, శ్మశానం, విద్యుత్, డ్రెయినేజీ, మంచి నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటాలకు సన్నద్ధమవుతున్నట్టు ఆ పార్టీ నగర కార్యదర్శి రామమోహన్ పేర్కొన్నారు. ఆదివారం మృత్యుంజయకుంటలో ఉన్న సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెర్లోపల్లి లేఔట్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ముఖ్యంగా రెవెన్యూ, హౌసింగ్ అధికారులు తమ పరిధిలో లేదని, కార్పొరేషన్ అధికారులు తమకు సంబంధించిన అంశం కాదని, హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యంతో వాయిదాలు వేస్తున్నారని తెలిపారు. కాలనీ ఏర్పడి 17 సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటివరకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. ఈనెల 15 నుంచి 21 వరకు వివిధ రూపాల్లో పర్యటనలు, ప్రచారం పెద్ద ఎత్తున చేపట్టాలని నిర్ణయించామన్నారు. వర్షం వస్తే ప్రజలు కాలనీలోకి వంక దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, అక్కడ రహదారి నిర్మించాలని కోరుతున్నా స్పందించడం లేదని వాపోయారు. సామాన్య ప్రజలు నివసించే కాలనీల పట్ల కనీస స్థాయిలో స్పందన లేదని వారన్నారు. వర్షాకాలంలో ప్రజలు కాలనీలోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడకుండా తక్షణమే రహదారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు ఏమాత్రం కాలయాపన చేయకుండా సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో ఈనెల 22న కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రజానీకం పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటికి పరిష్కారం కాకపోతే అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కలుపుకొని పోరాటాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు బి.దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు పి.చంద్రారెడ్డి, పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోవడానికి అర్హులమే'

ప్రజాశక్తి - కడప అర్బన్ : సమాజంలో ఫిజియోథెరపిస్టులుగా సేవలు అందిస్తున్న తాము 'డాక్టర్' అనే పదం ప్రీఫిక్స్‌గా వినియోగించడానికి అర్హులమేనని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2021లో నేషనల్ కమిషన్ ఫర్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ కౌన్సిల్ యాక్ట్ తీసుకువచ్చిందని తెలిపారు. ఇందులో ఫిజియోథెరపిస్టులు తమ పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోవడానికి అనుమతించారని పేర్కొన్నారు. ఫిజియోథెరపిస్టులు డాక్టర్ అనే పదాన్ని ఉపయోగించకూడదని ఢిల్లీలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ కార్యాలయం నుంచి ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు డాక్టర్ సునీత శర్మ ఇటీవల లేఖ రాశారని తరువాత నిబంధనలను తెలుసుకుని ఆ లేఖను ఉపసంహరించుకున్నారని తెలిపారు.

రైతుల సమస్యలపై కలెక్టర్ దృష్టి సారించాలి

ప్రజాశక్తి - కడప : జిల్లాలో రైతుల సమస్యలపై కలెక్టర్ దృష్టి పెట్టాలని మాజీ రాష్ట్ర హార్టికల్చర్ సలహాదారుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప జిల్లాలో యూరియా కొరతతో రైతులు రోజురోజుకు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. యూరియా మార్కెట్లో ఎక్కువ ధర పెట్టినా దొరకని పరిస్థితి అన్నారు. కొంతమేర వచ్చిన రైతులకు అందడం లేదని వాపోయారు. ఒకపక్క ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి మొదలుకొని అధికారుల వరకు ఎక్కడా కొరత లేదని మాట్లాడడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, అధికారులు వెంటనే స్పందించి జిల్లాలో ఏయే ప్రాంతాల్లో యూరియా ఎంత అవసరం ఉన్నది నివేదికలు తెప్పించుకొని ప్రత్యేక చొరవతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉల్లికి సంబంధించి ప్రభుత్వం కొనుగోలు అన్నారు

మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్

అవార్డులతో పెరిగిన గురువుల బాధ్యత

-సన్మాన సభలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్

ప్రజాశక్తి-కాశినాయన (పోరుమామిళ్ల)

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో గురువుల బాధ్యత మరింత పెరిగిందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం పోరుమామిళ్ల లోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోరుమామిళ్ల మండల అధ్యక్షులు బి.ఈశ్వరరావు అధ్యక్షతన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల సన్మాన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలో అవార్డు పొందిన 14 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా మాదన విజయ కుమార్ మాట్లాడుతూ. డాక్టర్‌సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏడాదీ సెప్టెంబర్ 5న జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవార్డుల ద్వారా ఉపాధ్యాయులను గౌరవిస్తున్నారని చెప్పారు. పోరుమామిళ్ల ప్రాంత ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు రావడం అభినందనీయమన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు రావడానికి వెనుక ఉపాధ్యాయుల విశేషమైన కృషి దాగి ఉందన్నారు. పాఠశాల వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చి, విద్యార్థులతో స్నేహపూరితంగా మెలుగుతూ విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దగలిగిన వారే ఉత్తమ ఉపాధ్యాయులుగా రాణించగలుగుతారని ఆయన పేర్కొన్నారు. ప్రపంచీకరణ, పాలకుల విధానాల ఫలితంగా ప్రభుత్వ విద్యా రంగం నానాటికి సంక్షోభంలోకి నెట్టబడుతుందన్నారు. కార్పొరేట్ మాయాజాలంలో పడి ప్రభుత్వ విద్యపై విముఖత చూపుతున్నారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పోరుమామిళ్ల, కాశినాయన ఎంఇఒలు కొండిశెట్టి, ఓ.నిర్మల మాట్లాడుతూ నాలుగు గోడల మధ్య దేశ భవిష్యత్తును నిర్మించే వారే ఉపాధ్యాయులని, అలాంటి వారిలో విశిష్టమైన సేవలందించిన వారికి అవార్డులు ఇవ్వడం మంచి పరిణామన్నారు. ఈనెల 15 నుంచి 19 వరకు రణభేరి నిర్వహించున్నామని, ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు చెన్నయ్య, ఈరి బాలజోజి, జిల్లా కన్వీనర్ ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ డిఎంహెచ్ఒ మార్కారెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పి.నారాయణరెడ్డి, గురుమూర్తి, ఓ.రాయప్ప, సిఐటియు జిల్లా కార్యదర్శి భైరవ ప్రసాద్, జిల్లా సీనియర్ నాయ కులు ఎం.రమణమూర్తి పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కృష్ణయ్య, ఖాజా నాయబ్ రసూల్, బాల ఓబయ్య, కె.వి.సుబ్బారెడ్డి, బి.భాస్కర్ రెడ్డి, కె.చెన్న కృష్ణయ్య, కె.పిచ్చిరెడ్డి, కొండయ్య పాల్గొన్నారు.

సమాజ ఉన్నతికి తోడ్పడాలి

ప్రజాశక్తి - బద్వేలు : సమాజ ఉన్నతికి ప్రతి జర్నలిస్టు కృషి చేయాలని బద్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య జర్నలిస్టు సంక్షేమ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర కన్వీనర్ రవికుమార్, కోకన్వీనర్ల ఆదేశాల మేరకు కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల జర్నలిస్టులతో కలిసి పట్టణంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో వైభవంగా నిర్వహించారు. జర్నలిస్టులను వారి సేవలను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వారధిలా పని చేసే జర్నలిస్టులు సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఇన్‌ఛార్జి వల్లంకొండు వెంకటరమణ, చలపాటి రవికుమార్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకల్లో ఆర్యవైశ్యులు

దయనీయం 'కారుణ్య' కుటుంబ జీవనం

- ఉద్యోగ నియామకాల కోసం ఎదురు చూపులు
- కార్మికులకు అందని వేతనాలు
- సమావేశంలో తీర్మానం చేసినా.. ఎమ్మెల్యే ఆదేశించినా ఫలితం శూన్యం
- నేటి నుంచి ఆందోళనకు శ్రీకారం

కార్పొరేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక సంస్థలో పారిశుధ్య, ఇంజినీరింగ్ సెక్షన్‌లో కార్మికులుగా పని చేస్తూ మృతి చెందిన, ఉద్యోగ విరమణ పొందిన కార్మికుల కుటుంబాలు వారసత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తూ ఉన్నారు. సంపాదిస్తున్న కుటుంబ పెద్ద, తల్లి, తండ్రి మృతి చెందడంతో ఆయా కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడి జీవనం సాగించడమే మృగ్యమైపోయింది. రెగ్యులర్ ఉద్యోగులు మృతి చెందితే వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని ప్రయోజనాలు లభిస్తాయి. అవసరమైతే కారుణ్య నియామకాలు చేపడుతారు. కానీ ఆప్కాస్‌లో పని చేస్తున్న కార్మికులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని భారం ఉన్నా వేతనాల్లో భారీ వ్యత్యాసం ఉంటుంది. పైగా వారికి ఇఎస్ఐ, పిఎఫ్ కూడా వర్తించదు. యూనియన్ నాయకులు పోరాటాలు చేసినప్పుడు మాత్రం అన్ని సౌకర్యాలు వర్తింపజేస్తామని కాంట్రాక్టర్లు, అధికారులు చెబుతారే తప్ప అమలు చేయడం విస్మరిస్తున్నారు. ఇప్పటికే అనేక మంది కార్మికులు ఉద్యోగ విరమణ పొందారు. ఫలితంగా మిగతా కార్మికులపై పనిభారం అధికమైంది. ఆప్కాస్‌లో పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న 9 మంది కార్మికులు 2, 3 సంవత్సరాల కిందట మృతి చెందారు. వారి వారసులకు ఇంతవరకు ఉద్యోగాలు ఇవ్వలేదు. ఇప్పటి వరకు వారు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇదీలా ఉంటే రిటైర్డ్ అయిన 41 మంది కార్మిక కుటుంబాల్లో 27 మందిని అదనపు కార్మికులకు తీసుకున్నారు. వీరికి నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణం. మిగిలిన 14 మంది కూడా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. అధికారులు మాత్రం వారికి మరోవైపు ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులుగా ఎక్కువ మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే ఉంటారు. వీరికి ఉద్యోగాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరం. మృతి చెందిన, ఉద్యోగ విరమణ పొందిన కార్మిక కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ, జనరల్ బాడీ సమావేశంలో ఆమోదం పొందిన ఇంతవరకు వారికి ఉద్యోగాలు వచ్చిన దాఖలాలు లేవు. రాష్ట్రంలో ఉన్న 8 కార్పొరేషన్లు, 110 మున్సిపాలిటీల్లో ఎక్కడా లేని రోస్టర్ పాయింట్ కడప కార్పొరేషన్‌లో అమలు చేయాలని అధికారులు చూస్తున్నారు. కొంత మంది అధికారులు ఉన్నతాధికారిని ఈ విషయంలో తప్పుదోవపట్టిస్తున్నారు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే మాధవి కూడా ఉద్యోగాలు ఇవ్వండని ఆదేశించినా అమలు చేసేవారు కరువయ్యారు. బ్యాక్‌లాగ్ పోస్టుల కింద 22 మందిని నియమిస్తే ఏ ఒక్కరూ పారిశుధ్య కార్మికులుగా పని చేయడంలేదు. ఒక్క కార్మికుడు మాత్రం ఇచ్చిన పోస్టులో పని చేస్తున్నారు. మిగిలిన వారు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు అందడం లేదు. ఏ పోస్టులో వీరిని తీసుకున్నారో ఆ పోస్టులో పని చేయించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. మృతుల వివరాలు కచ్చితంగా ఉన్నా ఏదో ఒక సాకుతో కార్మికుల కుటుంబాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రిటైర్డ్ అయిన కుటుంబాల వారసులతో పని చేయించుకుంటున్నారు, అయితే వీరికి జీతాలు ఇవ్వడం లేదు. జనరల్ బాడీ, స్టాండ్ కమిటీ జీతాలు ఇవ్వాలి, ఉద్యోగాలు ఇవ్వాలని తీర్మాణం చేసినా ఫలితం శూన్యం. కమిషనర్ వెంటనే స్పందించి కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. స్పందికపోతే సోమవారం నుంచి ఆందోళన బాట పట్టాలని నిర్ణయించారు.

ఉద్యోగం ఇచ్చి ఆదుకోండి

నా భర్త బండి రాముడు ఆప్కాస్ డ్రైవర్‌గా పని చేసేవాడు. 2023లో మృతి చెందారు. నలుగురు పిల్లలతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. నాకు ఉద్యోగం ఇస్తే కుటుంబాన్ని పోషించుకుంటాను.

- గంజికుంటు సుజాత, కడప.

తండ్రి మృతితో కుటుంబ పోషణ భారం

నా తండ్రి పందిటి దావీద్ పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తూ 2023లో మృతి చెందారు. ప్రస్తుతం కుటుంబం పోషణ భారంగా మారింది. అధికారులు తండ్రి పని చేస్తున్న ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలి.

- సౌజన్య, కడప. (దావీద్ కుమార్తె).

ఇద్దరు కుమార్తెల భారం నాపైనే



నా భర్త పి.వెంకటసుబ్బయ్య పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తు ఉండేవాడు. 2024లో మృతి చెందారు. భర్త మృతితో ఇద్దరు కుమార్తెలు పోషణభారం నాపై పడింది. పారిశుధ్య పని ఇచ్చి ఆదుకోవాలని అధికారులకు విన్నవిం చుకుంటున్న.

- పాశం రేణుకాదేవి, కడప.

ఎమ్మెల్యే న్యాయం చేయాలి

నా భర్త నగర పాలక సంస్థలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తూ 2023 మృతి చెందారు. నాకు ముగ్గురు కుమార్తెలు. ఒకరికి భర్త ఉన్నప్పుడే పెళ్లి చేశాం. ప్రస్తుతం ఇద్దరు ఉన్నారు. వీరికి పెళ్లి చేయాల్సిన బాధ్యత నా పై ఉంది. నా భర్త ఉద్యోగం నాకు ఇచ్చి న్యాయం చేయాలి. ఈవిషయంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని ఉద్యోగం ఇప్పించాలి.

- బొర్ర మాధవి, కడప.

సమస్యల పరిష్కారానికి ఆందోళన బాట

నగర పాలక సంస్థలో పని చేస్తున్న కార్మికుల కుటుంబాల సమస్యల పరిష్కారానికి ఆందోళన బాట పడుతున్నాం. సోమవారం నుంచి ఈ ఆందోళనలు కొనసాగుతాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు పారిశుధ్య, రిటైర్ట్ ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తాం.

- సుంకర రవి, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర అధ్యక్షులు.

గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

తొలి తెలుగు రాజకీయ ఖైదీ 'గాడిచర్ల'

- సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ భూతపురి గోపాల కృష్ణశాస్త్రి

ప్రజాశక్తి - కడప అర్బన్

గాడిచర్ల హరిసర్వోత్తమరావు సంపాదకీయాలు స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆంగ్ల ప్రభుత్వానికి చెంపపెట్టులా ఉండేవని, అందువల్లనే ఆయన తన సంపాదకీయంలో ప్రభుత్వాన్ని పరుషంగా నిందించారనే నెపంతో జైలుకు పంపించారని, అలా తెలుగునేలలో ఆయనే తొలి తెలుగు రాజకీయ ఖైదీ అయ్యారని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆదివారం ప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధులు, పత్రికా సంపాదకులు, గ్రంథాలయ ఉద్యమనాయకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 142వ జయంతిని నిర్వహించింది. గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ గాడిచర్ల 1907లో స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించారని, రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతూ బిపిన్‌చంద్రపాల్ ఉపన్యాసాలతో ఉత్తేజితులై వందేమాతరం ఉద్యమానికి నాయకత్వం వహించారన్నారు. అందువల్ల ఆయనను బ్రిటీష్ ప్రభుత్వం కళాశాల నుంచి బహిష్కరించడమే కాక ఎక్కడా ఉద్యోగం ఇవ్వరాదని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో బాలగంగాధర తిలక్‌లా ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలను మెచ్చి ప్రజలు ఆయనను 'ఆంధ్ర తిలక్' అని పిలిచారన్నారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం ఆయన 'సౌందర్యవల్లి' అనే పత్రిక నడిపారన్నారు. మరో సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు గ్రంథాలయ ఉద్యమం ద్వారా, తన సంపాదకీయాల ద్వారా ప్రజల్లో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నింపారన్నారు. కడప జిల్లా పర్యటనలో గాంధీజీ ప్రసంగాలను గాడిచర్లయే అనువదించారన్నారు. గాడిచర్ల పత్రికారంగంలోకి అడుగుపెట్టి 'స్వరాజ్య' అనే తెలుగు పత్రికను ప్రారంభించి ఆంగ్ల ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారన్నారు. సంపాదకుడుగా ఆయన ఎన్నో కొత్త పదాలు పుట్టించారని, 'ఎడిటర్' అనే పదానికి 'సంపాదకులు' అనే పేరు పెట్టింది ఆయనే అన్నారు. రచయిత కొత్తపల్లి రామాంజనేయులు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ సమయంలో గాడిచర్ల జైలులో చాలా దుర్భర జీవితాన్ని అనుభవించారన్నారు. కాళోజీ గాడిచర్లను కీర్తిస్తూ చెప్పిన కవితను వినిపించారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు చంద్రశేఖర్, రంగా, వెంకట నగేశ్ పాల్గొన్నారు.

వైద్య విద్యను దూరం చేస్తే సహించేది లేదు : వైసిపి

ప్రజాశక్తి - కడప

పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తే సహించేది లేదని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, కడప నగర మేయర్ సురేష్ బాబు అన్నారు. ఆదివారం రిమ్స్ సూపర్ స్పెషలిటీ, కేన్సర్, మానసిక వైద్యశాలలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు కోరుకునేది విద్య, వైద్యం, ఉపాధి అన్నారు. కోట్లు వెచ్చించి వైద్యశాలలను నిర్మిస్తే అందుబాటులోకి తెచ్చి మెరుగైన వైద్యం అందిచ్చాల్సింది పోయి వాటిని ప్రయివేట్ పరం చేయడం ఏమిటి? అని ప్రశ్నించారు. కీ.శే. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విద్య వైద్యాన్ని చేరువ చేస్తే చంద్రబాబు ప్రయివేట్ పరం చేసి దూరం చేస్తున్నారని విమర్శించారు. .సూపర్ స్పెషలిటీ వైద్యశాలకు వైఎస్ పేరు తొలగించారని, ప్రజల గుండెల్లో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలను అమ్మే కార్యక్రమానికి తెరాలేపారు అన్నారు. అయిదు మెడికల్ కళాశాలలు పూర్తయినా వాటిని వాడుకలోకి తీసురాకపోగా, సీట్లు వద్దని చెప్పి వెనక్కి పంపారు అన్నారు. ఇప్పుడు అన్ని మెడికల్ కాలేజీలను అనునాయులకు దోచి పెడుతున్నారని ఆరోపించారు. దుర్మార్గపు ఆలోచనను విరమించుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం అని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి చెస్ టోర్నీలో జిల్లా క్రీడాకారుల విజయం

ప్రజాశక్తి - కడప

బెంగళూరు రూరల్ జిల్లా చెస్ సంఘం, కర్ణాటక రాష్ట్ర చెస్ సంఘం సహకారంతో జాతీయ స్థాయి చెస్ టోర్నమెంట్‌ను ఈనెల 13న నిర్వహించారు. ఇందులో కడప జిల్లాకు చెందిన పలువురు ఆటగాళ్లు పాల్గొని అద్భుత విజయాలు సాధించారు. లాస్యశ్రీ (జాతీయ చెస్ ప్లేయర్) అండర్-16 బాలికల విభాగంలో 3వ స్థానం పొందింది. అమీనా (అమ్ము) అండర్-9 బాలికల విభాగంలో 3వ స్థానం సాధించింది. అర్హాన్ అండర్-9 బాలుర విభాగంలో 5వ స్థానం సాధించాడు. అనురాగ్ అండర్-16 బాలుర విభాగంలో 6వ స్థానం పొందాడు. లక్ష్మీ మనుస్రీ అండర్-12 బాలికల విభాగంలో 6వ స్థానం సాధించింది .సారయు అండర్-16 బాలికల విభాగంలో 8వ స్థానం సాధించింది. వినమ్రత అండర్-7 బాలికల విభాగంలో 10వ స్థానం సాధించింది. తబస్సుం ఈ టోర్నమెంట్‌లో బెస్ట్ ఉమెన్ ప్లేయర్ పురస్కారాన్ని గెలుచుకుంది. ఇతర ఆటగాళ్లలో కొందరు టై బ్రేక్ స్కోరు తేడా వల్ల లేదా అర్ధ పాయింట్ తేడాతో బహుమతులు చేజార్చుకున్నారు. రీహాన్ 4 పాయింట్లు, చెతన్ 4 పాయింట్లు,దేవాంశ్ 4 పాయింట్లు, నిఖిలేశ్వర 4 పాయింట్లు,షయాన్ 4 పాయింట్లు, హేమానంద 2 పాయింట్లు,భావేష్ 2 పాయింట్లు, సబీహా 1.5 పాయింట్లు సాధించారు. కడప జిల్లా చెస్ సంఘం కార్యదర్శి, కోచ్ అనీస్ దర్బారి ఈ విజేతలందరినీ అభినందించారు.

చెస్ క్రీడలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

మూడు రోడ్ల కూడలి వద్ద నిలిచిన వర్షపు నీరు

వర్షపు నీరు పోయేదెలా..!

అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు పట్టణం మోరగుడి గ్రామాన్ని కలిపే మూడు రోడ్ల కూడలి చిన్నపాటి వర్షానికే మడుగును తలపిస్తుంది. వర్షం వస్తే నీరు పోయేదెలా అని ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నిలిచిన వర్షపు నీటితో వాహనాలు, ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్డు పెద్దముడియం, ఆళ్లగడ్డ, కోయిలకుంట్ల, కర్నూల్ వెళ్లే ప్రధాన రహదారి. అంతేకాక మాజీ ఎమ్మెల్యే కుండా రామయ్య విగ్రహం ఎడమ భాగంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు చిన్నపాటి కుంటలా దర్శనమిస్తోంది. అక్కడక్కడా గుంతలు ఉన్నాయి. కరెంట్ ఆఫీస్ నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ఓ వైపున మొత్తం నీరు నిలిచి ఉంది. ద్విచక్ర వాహనదారులు ఇక్కడ కిందపడిన సందర్భాలు అనేకం. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

అరుదైన కాలభైరవుని కుడ్య శిల్పం

ప్రజాశక్తి - వల్లూరు

వల్లూరు మండలంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన దక్షిణ కాశీ, పంచనదీ క్షేత్రం పుష్పగిరి శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలోని

శివపాద ఆలయ ముఖ ద్వారంపై ద్వార పాలకుల కుడ్య శిల్పాలలోని కాలభైరవుడు పద్మాధారిక శివ ద్వారపాలకుడని, అత్యంత అరుదైన కుడ్య శిల్పమని రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ ఆదివారం అన్నారు. శివుని రూపాలలో భయానక రూపం కాల భైరవుడని చెప్పారు. ఆ రూపం ఉండడంతో ఆయనకు కాలభైరవుడని పేరు వచ్చిందని తెలిపారు. ఈ రూపం ఉన్నప్పటికీ ఆయన భక్తులకు రక్షకుడిగా, కాలానికి అధిపతి అన్నారు. కాలభైరవుని వాహనం శునకం, ఆయుధంగా త్రిశూలం, ఖడ్గం, కపాల, కొడవలి, వజ్ర, పాము, పిన్నాక విల్లును సాధారణంగా కలిగి ఉంటాడని చెప్పారు. మూడు కన్నులు కలిగి ఉండడం ఆ భైరవుని దివ్యత్వానికి నిదర్శనమని తెలిపారు. కంకణాలు, చీలమండలు, కాలికి పవిత్రమైన పోగు (యజ్ఞోపవీతం), వక్రీకృత సర్పాలతో, పులి చర్మాన్ని ధరించి ఉంటాడని వివరించారు. కాలభైరవుని అర్ధాంగి భైరవి అని తెలిపారు. ఈ అరుదైన కుడ్య శిల్పంలో కుడి వైపుపై చేతిలో పద్మాన్ని కలిగి ఉండడం ప్రత్యేకమన్నారు. కింది చేతిలో గద(ముసలం)ధరించి, ఎడమ వైపుపై చేతిలో సర్పాన్ని, ఇంకో హస్తం కటిహస్తమని తెలిపారు. త్రినేత్రాన్ని కలిగి, తలపై కిరీటధారిగా, నాగాభరణధారిగా, అర్ధస్వస్తికాసన భంగిమలో నిలుచున్న శిల్పాన్ని సుందర మనోహరంగా ఆనాటి శిల్పులు చెక్కారని చెప్పారు. ఇప్పటివరకు వెలుగు చూడని ద్వార పాలకుల శిల్పాలలో ఇది ప్రత్యేకమైందన్నారు. ఈ శిల్పం 13వ శతాబ్దానికి చెందిందని ప్రముఖ స్థపతి, వాస్తు శిల్ప వాచస్పతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి స్పష్టం చేశారని రచయిత వెల్లడించారు.

సిద్ధారెడ్డిపల్లి వద్ద సాగులో ఉన్న వరి పంట

ఆశాజనకంగా వరి పంట

ప్రజాశక్తి - చాపాడు

కుందూ, పెన్నా నది పరివాహక గ్రామాలతోపాటు బోరుబావుల కింద ఖరీఫ్‌లో సాగైన వరి పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతానికి మండలంలో 13వేల ఎకరాలలో వరి పంట సాగైనట్లు వ్యవసాయ శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. నాగులపల్లె, చాపాడు, సీతారామపురం, అనంతపురం, రాజువారిపేట, అయ్యవారిపల్లె, చియ్యపాడు, మొర్రాయపల్లె, సోమాపురం, సిద్ధారెడ్డిపల్లె, బద్రిపల్లె గ్రామాల పరిధిలో వరి పంట సాగు చేపట్టారు. ప్రస్తుతం గతేడాది సాగుచేసిన వరి ధాన్యం విలువ ధరలు ఏమాత్రం పెరగలేదని రైతులు వాపోతున్నారు. జగిత్యాల రకం 8 బస్తాల ధర రూ.14వేలు పలుకుతున్నాయని రైతులు సూచించారు. గత ఏడాది వరి పంట నూర్పిడి చేసిన సమయంలో 8 బస్తాల వరి ధాన్యం విలువ రూ.14వేల వరకు ఉంది. 10 నెలలు పూర్తి అయినా ధరల్లో పెరుగుదల కనిపించలేదు. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ధాన్యం నిలువ ఉంచుకున్న రైతులకు మాత్రం నష్టాలు మిగిలే పరిస్థితి కనబడుతోంది. రైతులు ఈ ఏడాది ఆరుతడి పంటల వైపు కూడా మొగ్గు చూపారు.

టిడిపిలో చేరిన పెన్నా నగర్ ముస్లింలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలోని సోములవారిపల్లె గ్రామ పంచాయతీ పెన్నానగర్‌కు చెందిన 50 మైనారిటీ కుటుంబాలు ఆదివారం స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎంపిపి నంద్యాల రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పెన్నానగర్ మైనారిటీ నాయకులు సయ్యద్, గండికోట నూర్‌బాషా, సయ్యద్ జమాల్ బాషా, సయ్యద్ ఖాజా హుస్సేన్, సయ్యద్ రఫీ, సయ్యద్ జాఫర్, అల్లా బకాష్, నూరుల్లా, గౌసులాజమ్, సయ్యద్ కరీముల్లా, సయ్యద్ సిద్దిక్, సయ్యద్ రసూల్, సయ్యద్ అమీర్, సయ్యద్ అలీ వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీలో చేరిన మైనారిటీ నాయకులు సయ్యద్ నూర్‌బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఎమ్మెల్యే, మాజీ ఎంపిపి ఆధ్వర్యంలో టిడిపిలో చేరామన్నారు. ఎమ్మెల్యే వరద మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నంద్యాల వరప్రసాద్‌రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జబీబుల్లా, కౌన్సిలర్ మహమ్మద్ గౌస్, మున్నా, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్, బేపారి గౌస్ బాషా, నూరి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి పెన్నానగర్ నాయకులు షామీర్, షరీఫ్, ఆటో బాషా, షరీఫ్ (కవి), ఖాసిం, ఆటో సుధాకర్, కులాయప్ప, సుబ్బరాయుడు, పెద్దబి, నరసింహ, పాములేటి, సుబ్బయ్య పాల్గొన్నారు.

టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎంపిపి

గిట్టుబాటు ధర లభించక రైతుల గగ్గోలు

అమాంతంగా పడిపోయి కూరగాయల ధరలు-పండ్ల తోటల రైతుల పరిస్థితి మరీ ఘోరం

సాగు చేసిన అరటితోట

ప్రజాశక్తి - సింహాద్రిపురం

శ్రీవిశ్వసనామ సంవత్సరంలో చాలా వరకు పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ధరలు అమాంతంగా పడిపోవడంతో పెట్టుబడులు సైతం రాక నష్టాలు చవిచూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల నియోజవర్గంలోని పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లి, సింహాద్రిపురం, తొండూరు, చక్రాయపేట మండలాలు కూరగాయలు, పండ్ల తోటలకు ప్రసిద్ధి. దాదాపు 650 ఎకరాల్లో ఉల్లి, ఎనిమిది వందల ఎకరాల్లో టమోటా, 970 ఎకరాల్లో టమోటా పంటను సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇవికాక అరటి, చీని మరో 60వేల ఎకరాల్లో సాగులో ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఉల్లి, టమోటా, మిర్చి ధరలు అమాంతంగా తగ్గిపోయాయి. ఉల్లి క్వింటాల్ రూ.800 నుంచి రూ.1500 వరకు, టమోటా కిలో రూ.5నుంచి రూ.10, మిరప కిలో రూ.20 నుంచి రూ.30 వరకు రైతులు విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తమకు పెట్టుబడులు కూడా రావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పండ్ల తోటల రైతుల పరిస్థితి మరీ ఘోరం..

పులివెందుల నియోజకవర్గంలో అరటి, చీని తోటలకు ప్రసిద్ధి. ఇక్కడ పండే చీని కాయలు, అరటికాయలు నాణ్యతగా ఉంటాయి. ఈ అరటికాయలకు విదేశాల్లో సైతం డిమాండ్ ఉంది. చీనీ కాయలకు సైతం అధిక రోజులు నిలువ ఉండడంతోపాటు పరిమాణం, నాణ్యత ఉన్నాయి. అరటికాయలు ధరలు ప్రస్తుతం మొదటి కోత కాయలు రూ.8 వేలు నుంచి రూ.10 వేలు లోపు, రెండవ అరటి చెట్టు కాయలు రూ.4 వేలు నుంచి రూ.6వేలలోపు మాత్రమే టన్నుకు వ్యాపారస్తులు చెల్లిస్తున్నారు. మరికొంతమంది రైతులకు సంబంధించి నాణ్యత పరిమాణం బాగాలేవని ధరలు మరింత తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులను ఆదుకొనకపోతే వారికి ఆత్మహత్యలే శరణ్యమని రైతు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో చాలామంది రైతులు ఇటీవల కాలంలో వ్యవసాయంపై మక్కువ చూపడం లేదని చెబుతున్నారు. పరిశ్రమలు నుంచి ఉత్పత్తి అయిన వస్తువులకు ఎమ్మార్పీ ధరలు ఉన్నట్లే.. రైతు ఉత్పత్తులకు కూడా ధరలు నిర్ణయించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుని తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగులో ఉన్న టమోటా

రైతుల గోడు పట్టని ప్రభుత్వాలు

మాట్లాడుతున్న పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రైతులు పండిస్తున్న పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి కోరారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం రైతుల గోడును ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. రైతులు పండించిన మిర్చి, పొగాకు, మామిడి, అరటి, చీనీ, టమోటా, ఉల్లి తదితర ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండ మార్కెట్లో టమోటా ధర కిలో రూపాయి పలకడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఇలా అయితే రైతు ఏ విధంగా బతకాలని పేర్కొన్నారు. మార్కెట్ ఇంటర్ వెన్షన్ స్కీం ద్వారా ప్రభుత్వం మార్కెట్లో రంగ ప్రవేశం చేసి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చూడాలని సూచించారు. లేకపోతే ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాని ప్రభుత్వం మాటలే తప్ప చేతల్లో చూపించడం లేదన్నారు. గిట్టుబాటు ధర లేకపోవడంతోపాటు గోరుచుట్టుపై రోకటి పోటులా రసాయనికి ఎరువుల ధరలు అమాంతంగా పెరిగాయన్నారు. 50కిలోల పొటాష్ ధర ప్రస్తుతం రూ.1800 ఉందన్నారు. ఒకేసారి రూ.265 పెరిగిందని తెలిపారు. 10-26-26 కాంప్లెక్స్ ధర మొన్నటి వరకు రూ.1470 ఉండగా ప్రస్తుతం రూ.1800 పెరిగిందన్నారు. ఒకేసారి రూ.330 పెరిగిందన్నారు. ఇలా అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందన్నారు. ఒక బస్తా యూరియా కోసం రైతులు పొలం పనులు వదిలి గంటలకొద్దీ బారులుతీరి నిలవాల్సి వస్తోందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం 6లక్షల 29వేల 500 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా ప్రస్తుతానికి 4 లక్షల 14వేల 389 టన్నులు మాత్రమే వచ్చిందని తెలిపారు. ఇంకా 2 లక్షల15 వేల 111 టన్నులు రావాల్సి ఉందని వివరించారు. మార్కెట్ ఇంటర్ వెన్షన్ స్కీం ద్వారా ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పెంచిన రసాయనిక ఎరువులు ధరలు వెంటనే తగ్గించాలని కోరారు. యూరియా కొరత నివారించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు ఇలా.. పట్టించుకోకపోతే ఎలా..!

ఆక్రమించి యథేచ్ఛగా వ్యాపారాలు-ధాన్యం ఆరబోత-పశువుల కట్టివేత-పట్టని అధికారులు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని కడప-కర్నూలు జాతీయ రహదారి నిర్వహణ తీరు అధ్వానంగా మారింది. నేషనల్ హైవే అథారిటీ అధికారులు జాతీయ రహదారి తీరును పర్యవేక్షించాల్సి ఉండగా ఆ మేరకు చర్యలు క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలుకు నోచుకోలేదు. వివరాల్లోకెళ్తే..హైవే దారులకు సంబంధించి సులువుగా రాకపోకలు సాగించేందుకు ఆయా గ్రామాల వద్ద సర్వీస్ రహదారులను ఏర్పాటు చేశారు. కొత్తపేట, పాటిమీదపల్లె, కొత్త నెల్లూరు, కొండారెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో సర్వీస్ రహదారులను నిర్మించారు. ఈ రహదారులపై రైతులు కొందరు తమ పంట ఉత్పత్తులను ఆరబోతకు ఉపయోగిస్తుండడంతో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని అరికట్టాల్సిన హైవే అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తూ వాహనదారుల ప్రమాదాలకు కారణమవుతున్నారు. అంతేకాకుండా సర్వీస్ రోడ్లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకొని తమ వ్యాపారాలను యథేచ్ఛగా చేసుకుంటున్నారు. మరికొందరు సర్వీసు రోడ్లపై బర్రెలను కట్టేస్తున్నారు. ఇలాంటి వాటివల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవడమేకాక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత హైవే అధికారులు స్పందించి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న విత్తనాలు

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల1993-94 పదవ తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు రెడ్డి మాట్లాడుతూ అప్పట్లో చదువు చెప్పిన ఉపాధ్యాయులను 16 మందిని పిలిచి, 32ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు ఇప్పుడు కలవడం, వారి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం గొప్ప విషయమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు వార చదువుకున్న పాఠశాలకు ఇన్‌వర్టర్, బ్యాటరీ, మరికొన్ని వస్తువులను వితరణ చేశారు. భవిష్యత్తులో కూడా పాఠశాలకు తమ సహకారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు మునిరెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, సంగిరెడ్డి, మెసూరయ్య, మనోహర్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, పుల్లమ్మ, శివ ప్రభాకర్‌రెడ్డి, చంద్రఓబులరెడ్డి, నాగేంద్ర రావు, నారాయణ దాసు, సరళ దేవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చాపాడు 'జడ్‌పి' పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998-1999 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం అయ్యారు. వారు చదివిన పాఠశాలలో అప్పుడు వారికి చదువునేర్పిన ఉపాధ్యాయులతో కలసి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. తమ కుటుంబసభ్యుల నేపథ్యం, చదువుకున్న జ్ఞాపకాలు సభాముఖంగా తెలియజేసుకున్నారు. విద్య నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు రామాంజనేయరెడ్డి, రమణ, రవి, శివ శంకర్, చిన్న వీరయ్య, ఆంజనేయులు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

హిందీ భాషోపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న హిందీ భాషోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. హిందీ భాషా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం శివమునెమ్మ మాట్లాడుతూ దేవనాగరి లిపిగా పేరున్న భాష హిందీ అన్నారు. మాతృభాషలో చక్కగా రాణించే విద్యార్థి ఇతర భాషల్ని సులభంగా అధ్యయనం చేయగలుగుతారని తెలిపారు. చిన్నపాటి సూచనలు పాటిస్తే హిందీ సులభంగా నేర్చుకోవచ్చు అన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హిందీ ఉపాధ్యాయులు లత, పర్వీన్, వసంతకుమారిని పాఠశాల తరుపున శివ మునెమ్మ శాలువతో సత్కరించి, మెమొంటోను అందజేశారు.

ఉపాధ్యాయులును సత్కరిస్తున్న హెచ్ఎం శివ మునెమ్మ

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపిటిఎఫ్ నాయకులు ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డిని కోరారు. ఆ మేరకు వారు ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల డిఎను వెంటనే ప్రకటించాలన్నారు. 30 శాతం మధ్యంతరభృతి చెల్లించాలని కోరారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. మెమో 57 ప్రకారం 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను సిఎం, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, ప్రొద్దుటూరు మండలశాఖ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, రాజుపాళెం మండలశాఖ అధ్యక్ష,కార్యదర్శులు నరసింహ కుమార్, రామదస్తగిరి రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు సుబ్బయ్య, జాన్ సురేష్, నారాయణరెడ్డి, రమణారెడ్డి, గురివిరెడ్డి పాల్గొన్నారు.

మూలకు చేరిన నాలుగు చక్రాల వాహనం

రూ.లక్షలు పోసి కొన్నారు.. పట్టించుకోవడం మరిచారు

ప్రజాశక్తి - ఖాజీపేట

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా చెత్త సేకరణ కోసం ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి రిక్షాలు, నాలుగు చక్రాల వాహనాలు కొనుగోలు చేసింది. ఆ వాహనాలు ప్రారంభానికి నోచుకోకుండానే మూలకు చేరాయి. ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం కూడా అమలుకు నోచుకోలేదు. ప్రజాధనం దుర్వినియోగం పట్ల ప్రజలు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాల్సిన అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం, గ్రామంలో ప్రజల సహకారంలేక స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. రూ.లక్షలు విలువైన వాహనాలు మూలకు చేరాయి. ఎండకు, వానకు అవి పనికిరాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటి వినియోగంపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

17న గండిలో టెంకాయల విక్రయ వేలం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో టెంకాయలు అమ్ముకొనుటకు ఈనెల 17న ఇ టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఇఒ జె. వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. కమిషనర్ దేవాదాయ శాఖ విజయవాడ ఉత్తర్వులు మేరకు లోబడి వేలం నిర్వహి స్తామ న్నారు.

హిందూ మతస్తులు మాత్రమే పాల్గొనా లన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ.10 లక్షలు డిపాజిట్ చెల్లించాల్సి ఉందన్నారు. వేలం ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు పాట మొత్తంలో డిపాజిట్‌తో కలిపి 50 శాతం చెల్లించాలని వారు పేర్కొన్నారు. మిగతా 50 శాతం కమిషనర్ దేవాలయ శాఖ విజయవాడ వారి మంజూరు ఉత్తర్వులు వచ్చిన వెంటనే కానీ లేదా మూడు నెలలు కాల వ్యవధిలో చెల్లించాలని సూచించారు. పైన తెలిపిన హక్కును నిలుపుదల, వాయిదా వేయుటకుగాని దేవస్థానం కార్య నిర్వహణాధికారికి పూర్తిగా అధికారం ఉందన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

విద్యుత్ సమస్యలు మండల వ్యాప్తంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలు, రహదారుల పక్కనే విద్యుత్ నియంత్రికల వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మండలంలో ముగ్గురు విద్యుత్తు గుత్తేదారులు ఉన్నా చేసేంత పనులు చేస్తూనే ఉన్నా ఎక్కడ సమస్యలు అక్కడ కనిపిస్తూనే ఉంటున్నాయి. వివరాల్లోకెళ్తే.. ఏటూరు నుంచి త్రిపురవరం దళితవాడకు వెళ్లే రహదారిలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. ఉధృతమైన గాలులు వీస్తే స్తంభాలు పడిపోయే ప్రమాదం లేకపోలేదు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. పొలాలన్నీ పంటలతో నిండి ఉన్నాయి. ఈ సమయంలో రైతులు ప్రమాదాలకు గురయ్యే ఆస్కారం ఉంది. ఏదైనా సంఘటన జరిగిన తర్వాత స్పందించే కంటే ముందుగానే అప్రమత్తమై సమస్యను పరిష్కరిస్తే బాగుంటుందని రైతులు సూచిస్తున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

గోడపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

11న ఎంపిజె రాయలసీమ మహాసభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అక్టోబర్ 11న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రొద్దుటూరులో మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె) ప్రాంతీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఆ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఎంపిజె నాయకులు తమ కార్యాలయంలో ఆదివారం గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్య దర్శి సలీం మాట్లాడుతూ ఎంపిజెను బలపరిచే వారందరూ ఈ మహా సభను జయప్రదం చేయా లన్నారు. రాజ్యాంగ ప్రేమి కులు కుల మతాలకు అతీ తంగా అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఎల్ఐసి ఆఫీసు పక్క వీదిలో ఉన్న ఎస్ఆర్ ఫంక్షన్ హాలు లో సభ జరుగుతుందని వివరించారు. అంతకు ముందు ఎంపిజె రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్, రాయలసీమ ఇన్‌ఛార్జి అయూబ్ మాట్లాడుతూ సమాజంలో ప్రజలందరూ శాంతి యుతంగా అభివృద్ధి పథంలో నడిచేందుకు ఈ సభ ఎంతో ఉపయోగపడు తుందన్నారు. కార్యక్ర మంలో కడప జిల్లా అధ్య క్షుడు సాకీరూమి, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, కార్యదర్శి రఫీ, ఇస్మాయిల్, గౌస్‌లాజం, షఫీ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, KADAPA
Succession O.P. No. 9/2025
1) Gaddam Sankar @ Sankaraiah, S/o. Late G. Gurranna, Hindu, aged 55 years, Business.
2) Gaddam Vasanthi, D/o. Gaddam Sankar aged 26 years. Sankaraiah, Hindu,
Both are residents of D.No. 18/506, BKM Street, Kadapa city & District.
...Petitioners
AND
-NIL- ...Respondent
GENERAL PUBLICATION
The above named petitioners filed the above S.O.P. No. 9/2025 seeking a Succession Certificate to claim below mentioned amount. The above said SOP is stands posted to 18-09-2025. If any one has any objections regarding issue of Succession Certificate in favour of the petitioners, he/they may attend the above said Hon'ble Court on 18-09-2025 at 10:30 a.m., and filed his objection if any, failing which the matter will be decided exparte on merits by the Hon'ble Court.
SCHEDULE
(1) An amount of Rs. 72,000/- is lying in E.P. No. 103/2018 in O.S. No. 775/2017 on the file of the Hon'ble III Addl., Junior Civil Judge's Court, Kadapa.
(2) Decreed Amount of Rs. 6,44,000/- along with future interest and costs of the suit in O.S. No. 178/2018 on the file of the Hon'ble Addl., Senior Civil Judge's Court, kadapa dated 08-03-2019.
//BY ORDER OF THE HON'BLE COURT//
Sd/- **ANDE SUBRAMANYAM,**
Advocate for Plaintiff, KADAPA.